40 గజాల ఇల్లు సరిపోతదా?

- ఇంటి నిర్మాణం కోసం 5లక్షలు ఇస్తామన్న మన హామీ ఏమైంది?
- నాయకులకు నచ్చిన వాళ్లకే ఇండ్లు ఇచ్చుకోవడమేంటి?
- హామీల వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీని జనం నమ్ముతలేరు
- ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సభలో నిలదీసిన సొంతపార్టీ నేతలు



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట కమ్యూనిటీ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్. చిత్రంలో నాయకులు, అధికారులు

మణికొండ, మే 26: కాంగ్రెస్ పార్టీపై సొంతపార్టీ నేతల నుంచే వ్యతిరేకత తీవ్రమవుతున్నది. రంగారెడ్డి జిల్లా నార్సింగిలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. సోమవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట కమ్యూనిటీ హాల్‌లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గండిపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను నిలదీశారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు అటకెక్కించడం వల్ల ప్రజల్లో విశ్వాసం కోల్పోతున్నామని నిప్పులు చెరిగారు. గతంలో 60 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాలని చెప్పి ఇప్పుడు 40 గజాలకే పరిమితం చేయడమేంటని నిలదీశారు. ప్రజాప్రభుత్వం అంటూనే ఏకపక్ష నిర్ణయాలతో అనర్హులకు ఇండ్లు ఇస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా ఇండ్ల పట్టాలు పంపిణీ చేయడమేంటని గండిపేట మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను నిలదీశారు.

మమ్మల్ని పట్టించుకోకుండా ఇండ్లిస్తరా?

నార్సింగి మాజీ కౌన్సిలర్ ఉషారాణి మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రజాప్రతినిధులను, స్థానిక నాయకులను పట్టించుకోకుండా కొందరు నేతలకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే ఇండ్లు ఇచ్చుకోవడమేంటని మండిపడ్డారు. తమ గ్రామం నుంచి దరఖాస్తు చేసుకున్నవారిలో ఒక్కరిని కూడా ఎంపిక చేయకపోవడమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలే నిలదీయడంతో కంగుతిన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.. వారి నుంచి మైకు తీసుకున్నారు. ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తున్నదని, అందరూ సహకరించాలని కోరుతూ సమావేశాన్ని ముగించారు.

పట్టా పొందినా నమ్మకంలేదు

"ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడేమో 40 గజాలు స్థలంలోనే ఇల్లు కట్టుకోవాలని, నాలుగు దిక్కులా ఖాళీ జాగా ఉండాలని రూల్ పెట్టింది. 40 గజాల స్థలంలో నిర్మించే ఇంట్లో ఎలా ఉంటాం? రూల్స్ పేరుతో మంజూరైన పట్టాలను రద్దు చేస్తామని అధికారులు బెదిరిస్తున్నారు. మేం పట్టాలు తీసుకున్నా ప్రయోజనం ఉంటుందని నమ్మకంలేదు"

—ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, నార్సింగి

పేదలకు అందని ఇందిరమ్మ ఇండ్లు

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్, మే 26 (నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. తొలి ఏడాది 4.16 లక్షల మందికి ఇండ్లు కట్టిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను నమ్మించి నట్టేట ముంచిందని వాపోయారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన 77.18 లక్షల దరఖాస్తులను పరిశీలించిన సర్కారు 36.03 లక్షల మందిని మాత్రమే అర్హులని ప్రకటించిందని, మిగతా 41.15 లక్షల మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు కాంగ్రెస్ రంగులు వేసి ఇందిరమ్మపేరుతో కేటాయిస్తున్నారని ఆరోపించారు. కారు, వ్యాను, ట్రాక్టర్ తదితర నాలుగు చక్రాల వాహనాలు ఉంటే ఇందిరమ్మ ఇంటికి అనర్హులుగా తేల్చుతున్నారని, ఇది దళిత బంధు లబ్ధిదారులపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని తెలిపారు.

శ్లాబ్ దశలో 64 ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి పొంగులేటి వెల్లడి

హైదరాబాద్, మే 26(నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా 64 ఇందిరమ్మ ఇండ్లు శ్లాబ్ దశకు చేరుకున్నాయని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద 47,335 ఇండ్లు మంజూరు చేయగా, అందులో ఇప్పటి వరకు 7,824 ఇండ్లు బేస్‌మెంట్ దశకు, 895 ఇండ్లు గోడలు, 64 ఇండ్లు శ్లాబ్ దశకు చేరుకున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సోమవారం రూ. 14.44కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ. 68.08కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. లబ్ధిదారులు తమ ఇష్టమైన రీతిలో 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా ఇల్లు నిర్మించుకోవచ్చని సూచించారు.

3 రోజులున్నా 'ముచ్చటే' లేదు!

మొదటిపేజీ తరువాయి...

అపాయింట్‌మెంట్ అడుగుతున్నాని రాహుల్‌కు వివరించినట్టు తెలిసింది. ఈ ప్రతిపాదనపై రాహుల్ సానుకూలంగా స్పందించలేదని తెలిసింది. పైగా రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అదానీతో సత్సంబంధాలు కొనసాగించడం ఏమిటని ప్రశ్నించినట్టు తెలిసింది. తరుచూ ప్రధానిని కలుస్తున్నారని, కానీ ఒక్కసారి కూడా బీసీ ఎజెండా మీద మోదీతో చర్చించలేదని, ఇది కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ ఏజెండాను నీరుగార్చడమేనని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు చర్చ జరుగుతున్నది. పైగా సీఎం వరుస విదేశీ పర్యటనలపైనా రాహుల్ అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం.

నేను చెప్పినవారికి పదవులిస్తేనే..

మంత్రివర్గ విస్తరణ జాబితాలో సుదర్శన్‌రెడ్డి, గడ్డం వివేక్, ఆది శ్రీనివాస్, ఫహీం ఖురేషీ పేర్లు ఉన్నట్టు సమాచారం. అయితే పార్టీ అవసరాల దృష్ట్యా గతంలో కొందరికి పదవులు ఇస్తామని మాట ఇచ్చామని, వారికి మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని సూచించినా రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి చోటు ఇవ్వాలని గతంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధిష్ఠానానికి ప్రతిపాదించారని, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం శ్రీహరి పేరును సూచించినట్టు ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిల్లో ఒక్కరినైనా మంత్రివర్గంలోకి తీసుకోవాలని అధిష్ఠానం సూచించినట్టు సమాచారం. ముస్లిం మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్‌కు అవకాశం ఇవ్వాలని ఢిల్లీ పెద్దలు నిర్ణయించినట్టు చెప్పుకుంటున్నారు. కానీ రేవంత్ రూపొందించిన జాబితాలో ఒక్కరి పేర్లు కూడా లేకపోవడంపై రాహుల్ అసహనం వ్యక్తం చేశారని సమాచారం. ఎలాంటి పదవి లేని ఫహీం ఖురేషికి ఏకంగా మంత్రి పదవి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించినట్టు చెప్పుకుంటున్నారు. చివరికి.. రాహుల్ స్వయంగా నలుగురి పేర్లను సిఫారసు చేసినట్టు సమాచారం. ఆ నాలుగు పేర్లకు అంగీకారం తెలిపితేనే అపాయింట్‌మెంట్ ఇస్తానని తెగేసి చెప్పినట్టు కాంగ్రెస్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

వేణుగోపాల్ క్లాస్?

రేవంత్‌రెడ్డి ఆదివారం మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారని, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ కూర్పు, ఇతర అంశాలపై చర్చలు జరిపినట్టు తెలిసింది. కేసీ వేణుగోపాల్ కొన్ని సవరణలు, సూచనలు చేసినట్టు సమాచారం. ఈ మేరకు రేవంత్ సోమవారం మరోసారి వేణుగోపాల్‌తో భేటీ అయ్యారని, పీసీసీ కార్యవర్గ జాబితాలో మార్పులు చేసినా, మంత్రివర్గ విస్తరణ జాబితాను మాత్రం యథాతథంగా ఉంచినట్టు చెప్పుకుంటున్నారు. ఇద్దరి మధ్య దాదాపు రెండు గంటలు చర్చలు సాగినట్టు తెలిసింది. వేణుగోపాల్ మాట్లాడుతూ మీ నిర్వాకం వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ బలపడుతున్నదని, ఈ అంశంలో అధిష్ఠానం అసంతృప్తితో ఉన్నదని చెప్పినట్టు సమాచారం. అవినీతి ఆరోపణలు, తొందరపాటు నిర్ణయాలు, అనవసర విదేశీ పర్యటనలు ఇందుకు ప్రధాన కారణమని అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇక ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వ్యవహారశైలి ఇబ్బందిగా ఉన్నదని, ఆమె మరో పవర్ సెంటర్‌గా మారుతున్నదని, ఆమెను తొలగించాలని రేవంత్‌రెడ్డి కోరినట్టు చెప్పుకుంటున్నారు. ఈ ప్రతిపాదన పట్ల కేసీ వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారని, రాష్ట్రంలో పరిస్థితి బాగాలేదనే ఆమెను నియమించారని, అలాంటి వ్యక్తిని తొలగించాలని ఎలా అడుగుతారని ప్రశ్నించినట్టు సమాచారం. చర్చలు ముగిసిన తర్వాత మహేశ్‌కుమార్‌గౌడ్‌ను వెంట బెట్టుకొని కేసీ వేణుగోపాల్ సోమవారం రాహుల్‌ను కలిసినట్టు సమాచారం. పీసీసీ కార్యవర్గం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాహుల్, మంత్రి వర్గ విస్తరణ జాబితాను పక్కన పెట్టినట్టు తెలిసింది.

నన్ను చులకన చేయడానికే ఇదంతా?

రాహుల్ సిఫారసు చేసిన నలుగురిలో ముగ్గురి పట్ల రేవంత్ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు చర్చ జరుగుతున్నది. ఇందుకు కారణాలను కలిసి వివరిస్తానని మూడు రోజులు ఎదురుచూసినా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, ఇదే సమయంలో మహేశ్‌కుమార్ గౌడ్‌ను రాహుల్ గాంధీ రెండుసార్లు కలవడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. తన ప్రాబల్యాన్ని తగ్గించటానికే అధిష్ఠానం వ్యూహాత్మకంగా ఇలా చేస్తున్నదని సీఎం తన సన్నిహితుల వద్ద అసహనం వ్యక్తం చేశారని సమాచారం. ఏదేమైనా సరే ముగ్గురిని మంత్రులుగా అంగీకరించే ప్రసక్తే లేదని టీపీసీసీ చీఫ్‌కు తెగేసి చెప్పి, రేవంత్‌రెడ్డి వెనుదిరిగినట్టు సమాచారం.దీంతో హస్తిన కేంద్రంగా మూడు రోజులపాటు కాంగ్రెస్ చేసిన హైడ్రామా తుస్సుమన్నది. మంత్రివర్గ కూర్పు, పీసీసీ కార్యవర్గ ఏర్పాటుపై నిర్ణయాన్ని ఈ నెల 30వ తేదీకి అధిష్ఠానం వాయిదా వేసినట్టు తెలిసింది. ఆ రోజున రాష్ట్ర కీలక నేతలంతా ఢిల్లీకి రావాలని చెప్పినట్టు సమాచారం.

ఆమెను బద్నాం చేద్దాం!

- అందాల పోటీలకు స్పాన్సర్లు నిల్
- రూ.25 కోట్ల స్పాన్సర్‌ను తిరస్కరించారంటూ ఓ ఐఏఎస్ అధికారిపై కొందరి ఆరోపణలు
- అనుకూల మీడియాలో లీకులు
- గతంలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టినందుకు ప్రతీకార చర్యలు?
- 'మిస్ వరల్డ్' అభాసుపాలును మరో డైవర్షన్ చేసేందుకు ప్లాన్

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): మిస్ వరల్డ్ స్పాన్సర్‌షిప్ వివాదాన్ని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి మెడకు చుట్టేందుకు ప్రభుత్వంలోని కొందరు కుట్ర పన్నుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అందాల పోటీలకు నిధులిస్తామని వాణిజ్య సంస్థలు ముందుకొచ్చినా... ఆమె నిర్లక్ష్యంతో వెనక్కి వెళ్లిపోయారనే అపవాదును ప్రభుత్వం వ్యూహాత్మకంగా తెరమీదకు తెచ్చినట్టు సమాచారం. సదరు మహిళా అధికారి ఉదాసీనత కారణంగానే రాష్ట్ర ఖజానా మీద రూ.27 కోట్ల భారం పడిందని ఆమెపై ఆరోపణ చేసి, అందుకు బాధ్యురాలిని చేసేందుకు సీఎంవోలో పక్కా స్క్రిప్ట్ తయారు చేస్తున్నట్టు సమాచారం. ఖరీఫ్ విత్తనాలు, తడిసిన వడ్ల కొనుగోలు కోసం రైతులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో రూ.200 కోట్లు ఖర్చు చేసి అందాల పోటీలు నిర్వహించడం ఎందుకని ప్రతిపక్ష పార్టీలు నిలదీశాయి. దీంతో మీడియా ముందుకు వచ్చిన సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. అందాల పోటీలకు రూ.54 కోట్లు ఖర్చవుతుందని, ఇందులో 50 శాతం అంటే రూ.27 కోట్ల వరకు మిస్ వరల్డ్ నిర్వహణ సంస్థ భరిస్తుండగా మిగతా సగం ప్రభుత్వం సర్దుబాటు చేయాల్సి ఉన్నదని ప్రకటించారు. ప్రభుత్వం పెట్టాల్సిన ఖర్చులో రూ.25 కోట్ల మేర నిధులు సమకూర్చేందుకు స్పాన్సర్లతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. ఈ మేరకు ఫార్మా, మీడియా, రియల్ ఎస్టేట్, పర్యాటక, బ్యాంకింగ్ సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపినట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.

ముందుకొచ్చిన జాతీయ బ్యాంక్

ఓవైపు మిస్‌వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లండ్ ఆరోపణలతో వివాదాస్పదం కావడం, మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసిందన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో ఇంతవరకు ఈ ఈవెంట్‌ను స్పాన్సర్ చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదని తెలిసింది. అధికారంలో ఉన్న ప్రభుత్వం ఓ స్పాన్సర్‌ను సాధించలేకపోయిందన్న విమర్శలు వ్యక్తమయ్యే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఇందుకు ఓ ఐఏఎస్ అధికారిని బాధ్యురాలిగా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. అందాల పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్పాన్సర్ చేసేందుకు ఓ బ్యాంక్ యాజమాన్యం ముందుకు వచ్చిందని, రూ.25 కోట్లు ఏకమొత్తంగా ఖర్చు చేసేందుకు ఆసక్తిని చూపిందని, మిస్ వరల్డ్ పోటీలకు అప్పట్లో ఇన్‌చార్జిగా వ్యవరించిన అధికారిని కలిసేందుకు వెళ్లగా.. ఆమె అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఓ కథనాన్ని ప్రభుత్వంలోని కొందరు తెర మీదకు తెచ్చారు. దాదాపు నాలుగైదు గంటలు వేచి ఉన్న జాతీయ బ్యాంకు యాజమాన్యం.. ఆ అధికారిని కలిసి తమ ఆసక్తి వ్యక్తం చేయగా.. 'మీరు ఒక్కరే ఎలా స్పాన్సర్ చేస్తారు, అందరికీ అవకాశం ఇవ్వాలి కదా' అంటూ ఆ బ్యాంక్ స్పాన్సర్‌ను తిరస్కరించినట్టు చెప్తున్నారు. ముందుగా ఈ కథనాన్ని ప్రభుత్వ అనుకూల మీడియాగా ముద్రపడిన ఓ ఎల్లో ప్రతికలో ప్రముఖంగా ప్రచురించారు. అనంతరం ఆ ప్రచారాన్ని కాంగ్రెస్ సోషల్ మీడియా అందుకొని గత రెండు రోజుల నుంచి విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చింది. మరో అధికారి కూడా చిన్న స్పాన్సర్ కంపెనీల నుంచి వచ్చే స్పాన్సర్‌షిప్‌ల నుంచి కమీషన్లు ఆశించినట్టు ప్రచారం జరుగుతున్నది.

ఎట్లాగైనా ఇరికించాలె

ఇద్దరు అధికారుల మీద దృష్టి పెట్టిన ప్రభుత్వంలోని కొందరు నిఘా వర్గాలను రంగంలోకి దించినట్టు తెలిసింది. మిస్‌వరల్డ్ పోటీలకు స్పాన్సర్‌లు రాకపోవడానికి గల కారణాలను నిఘా అధికారులు అన్వేషిస్తున్నట్టు సమాచారం. పోటీల ప్రారంభానికి ముందు కీలకంగా వ్యవహరించిన అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారని, మరో అధికారి ప్రమేయం కూడా ఇందులో ఉందనేలా వార్తా కథనాలను వడ్డివార్చేందుకు సీఎం ఆఫీస్‌లోనే కసరత్తు జరుగుతున్నదని తెలుస్తున్నది. సదరు అధికారిణి ఇటీవల కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపైనా సోషల్ మీడియాలో పోస్ట్ రీట్వీట్ చేయడం చర్చనీయాంశంగా మారింది.ఆ రీట్వీట్‌తో ప్రభుత్వం ఇరుకున పడిందని, అందుకే ఆ అధికారిని బద్నాం చేయాలని కొందరు పెద్దలు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది.

బీసీ కమిషన్‌కు 3.56కోట్లు మంజూరు

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బీసీ కమిషన్‌కు రూ.3.56కోట్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీసీ కమిషన్ నిర్వహణకు ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.14.25కోట్లను కేటాయించింది. దీనిలో భాగంగా 3.56కోట్లను విడుదల చేసింది.

ఎనర్జీ డిపార్ట్‌మెంట్ 'సీవీవో'గా ప్రియదర్శిని

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): ఎనర్జీ డిపార్ట్‌మెంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా (సీవీవో)ఆశాఖ డిప్యూటీ సెక్రటరీ ఎస్ ప్రియదర్శిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇదివరకు సీవీవోగా ఎం శారదాబాయి వ్యవహరించగా, ఆమె బదిలీ అయ్యారు. దీంతో తాజాగా ఎస్ ప్రియదర్శినిని ప్రభుత్వం నియమించింది.

డిస్కంలకు 1,900కోట్లు

రాష్ట్రంలో విద్యుత్తు పంపిణీ సంస్థలకు ప్రభుత్వం రూ.1,900కోట్లకు పైగా నిధులను మంజూరు చేసింది. గృహజ్యోతి సబ్సిడీ కింద ఆయా మొత్తాన్ని విడుదల చేసింది.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

- రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ అరుణ, డాక్యుమెంట్ రైటర్ వెంకటేశ్

ఖమ్మం రూరల్, మే 26 : ఓ డాక్యుమెంట్ రైటర్ మధ్యవర్తిత్వం ద్వారా రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ అరుణ సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ రమేశ్ కథనం ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన ఓ వ్యక్తికి రూరల్ మండలం తల్లంపాడులో సర్వే నంబర్ 713/ఏ2లో 2,700 చదరపు గజాల స్థలం ఉంది. ఆ భూమిని తన కొడుకు పేరుపై గిఫ్టు రిజిస్ట్రేషన్ చేయించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. సబ్ రిజిస్ట్రార్ రూ.50 వేలు డిమాండ్ చేశారు. రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మొత్తాన్ని రైటర్ వెంకటేశ్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

నాలుగోసారి కోడిగుడ్ల టెండర్ల గడువు పొడిగింపు

- జూన్ 23వరకు దాఖలుకు అవకాశం

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీలకు సరఫరా చేసే కోడిగుడ్ల టెండర్ల గడువును నాలుగోసారి పొడిగించినట్టు చైల్డ్ అండ్ ఉమెన్స్ డెవలప్‌మెంట్ కమిషన్ కార్యాలయ అధికారులు సోమవారం వెల్లడించారు. జూన్ 23వరకు దాఖలుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. అయితే పదేపదే టెండర్ గడువు పొడిగింపుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే గడువు పొడిగించినట్టు చర్చ జరుగుతున్నది.

చేపపిల్లల పంపిణీ ఇంకెప్పుడు?

- పథకంపై స్పష్టత కరువు
- సిద్ధంకాని అధికారులు
- మత్స్యకార సంఘాల గరం

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): అధికారుల ప్రణాళికల లోపం మత్స్యకారులను ఆందోళనకు గురిచేస్తున్నది. చేపపిల్లల పంపిణీ కోసం ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి, మే రెండో వారం నాటికి చేపపిల్లలను సమకూర్చుకోవాలి. జూన్ నుంచి ఆగస్టు మధ్యలో వాటిని చెరువులు, కుంటల్లో వదలాల్సి ఉంటుంది. 2016లో కేసీఆర్ ప్రభుత్వం పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇదే ప్రణాళికను అమలు చేసింది. కానీ నిరుడు కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్‌లో చేపలను వదిలారు. చేపలు సరైన సైజులో పెరగకపోడంతో మత్స్యకారులు నష్టపోయారు. అధికారులు ఈ ఏడాది గుణపాఠం నేర్చుకోలేదని మత్స్య సంఘాల నేతలు మండిపడుతున్నారు.

హాస్పిటల్ పనులు త్వరగా పూర్తిచేయాలి

- మౌలిక వసతులు, యంత్రపరికరాలపై దృష్టిపెట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

వరంగల్ చౌరస్తా, మే 26 : మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్‌అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్రకుమార్‌తో కలిసి హాస్పిటల్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ హాస్పిటల్ దేశానికే ఐకానిక్ కాబోతున్నదని చెప్పారు. అదనపు మౌలిక వసతులు, వైద్యసేవల వివరాలపై నెలాఖరులోగా నివేదిక ఇవ్వాలని సూచించారు. అనంతరం భవన నిర్మాణాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఐదు డీఏలూ ఇవ్వాల్సిందే!

- ఒక్క హామీ నెరవేర్చరా..?
- సర్కారుపై పెన్షనర్ల మండిపాటు

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ) : అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా... ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చరా..? అంటూ పెన్సనర్స్ జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య సర్కారును ప్రశ్నించారు. పెన్షనర్ల పట్ల చిన్నచూపు చూస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పెన్షనర్ల జేఏసీ కోర్ కమిటీ సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం గర్హనీయమని మండిపడ్డారు. ఒక డీఏ ఇస్తామని సర్కారు పెద్దలు లీకులిస్తున్నారని, ఒక డీఏ ఇస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని, పెండింగ్ డీఏలను విడుదల చేయాల్సిందేనని స్పష్టంచేశారు. 15 నెలలుగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడంలేదని, రిటైర్డ్ ఉద్యోగులంతా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేటీఆర్, చిత్రంలో తలసాని, సునీతాలక్ష్మారెడ్డి, తుల ఉమ, అల్లం నారాయణ, టీజేఎఫ్ నేతలు

ఉద్యమంలో జర్నలిస్టులది కీలకపాత్ర

- టీజేఎఫ్ రజతోత్సవం గర్వకారణం
- పోస్టర్ ఆవిష్కరణలో కేటీఆర్

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): దశాబ్దాలపాటు దగాపడ్డ తెలంగాణ ప్రజల విముక్తి కోసం కేసీఆర్ సారథ్యంలో సాగిన మలి దశ ఉద్యమంలో ప్రజలను చైతన్యపరచడంలో తెలంగాణ జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చెప్పారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవ పోస్టర్‌ను తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలక పాత్ర పోషించిన టీజేఎఫ్ 25 వసంతాల సంబురాలు జరుపుకోవడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు. టీజేఎఫ్‌కి తాము ఎప్పటికీ అండగా ఉంటామని స్పష్టంచేశారు. అల్లం నారాయణ మాట్లాడుతూ.. ఈ నెల 31న జలవిహార్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవాలకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్, టెంజు ప్రధాన కార్యదర్శి ఏ రమణకుమార్, మాజీ మంత్రులు తలసాని, సునీతాలక్ష్మారెడ్డి, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ పాల్గొన్నారు.

కొవిడ్‌పై అవగాహన కల్పించాలి

- అధికారులకు దామోదర ఆదేశం

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): కొవిడ్‌పై నిరంతరం నిఘా కొనసాగించాలని.. ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు సూచించారు. సోమవారం కొవిడ్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వ్యాధుల నివారణకు